ప్రజల మాట ప్రగతి బాట

# బెల్లంపల్లి నియోజకవర్గం


బెల్లంపల్లి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య


పార్టీలో చేరిన భీమిని మండల నాయకులతో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

## ప్రతి కార్యకర్త అభ్యర్థిలా పని చేయాలి

- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- బీఆర్ఎస్‌లో చేరికలు

బెల్లంపల్లి, నవంబర్ 1: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిలా పనిచేస్తే తప్పకుండా నియోజకవర్గంలో భారీ మెజార్టీతో విజయం సాధిస్తామని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని పద్మశాలీభవన్‌లో బుధవారం నిర్వహించిన బూత్, పట్టణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం బడా వ్యాపారి, సామాన్య బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తకు జరుగుతున్న ఎన్నికలని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్నో అపనిందలు వేసి నీచ రాజకీయాలు చేసినా కేసీఆర్ చేసిన నాలుగు సర్వేల్లో తనకు ప్రజా ఆశీర్వాదం ఉందనే గట్టి నమ్మకంతో మూడవసారి పార్టీ టికెట్ కేటాయించారని గుర్తు చేశారు. డబ్బుతో వినోద్ ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఆలోచనను ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ దవాఖానాలు, ఢిల్లీ పబ్లిక్ స్కూళ్లు, అమెరికా, కార్పొరేట్ ఆలోచనా విధానంతో వస్తున్న వినోద్ కార్యకర్తలను నమ్మరని వారి ఐదారుగురు పీఏలను మాత్రమే నమ్ముతారని ఎద్దేవా చేశారు. ప్రజలకు సేవ చేసే చిత్తశుద్ధి ఆయనకు లేదని విమర్శించారు. కేవలం ఎన్నికల వేళ ఐదేళ్ల కోసారి వచ్చే వ్యక్తులను బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని గుర్తుచేశారు. చెన్నూర్‌లో 5, 6 సార్లు పోటీ చేసి కేవలం ఒకే సారి గెలిచి మంత్రిగా చేసిన ఆయన అక్కడి ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. చెన్నూర్‌లో చెల్లని రూపాయి ఇక్కడ ఏ విధంగా చెల్లుతుందని ప్రశ్నించారు. ప్రతి కౌన్సిలర్ తమ వార్డు పరిధిలోని సభ్యులతో కలిసి కేసీఆర్ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇంటింటికీ తీసుకువెళ్లాలని సూచించారు. తొమ్మిందేండ్ల క్రితం జరిగిన అభివృద్ధి, అంతకుముందు జరిగిన అభివృద్ధి, ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చే వారిపై ప్రజలకు వివరించాలని తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలో 40వేల పైచిలుకు ఓట్లు ఉన్నాయని ఇక్కడి ప్రజలు అధిక మెజార్టీతో ఆశీర్వదిస్తే గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణకు సీఎం కేసీఆర్ శ్రీరామ రక్ష అని తెలకిపారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అద్భుతమని, వాటికి సంబంధించిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మోదీ ప్రభుత్వ హయంలో ఉన్న రూ. 1200 ను రూ. 400 తగ్గిస్తున్న విషయాన్ని ప్రతి మహిళకూ తెలియజేయాలన్నారు. రూ. 2వేల పింఛన్‌ను రూ. ఐదు వేలకు పెంచిన విషయాన్ని ప్రతి వృద్ధుడికి వివరించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకూ సౌభాగ్యలక్ష్మి పేరిట రూ. 3 వేలు అందించే కార్యక్రమాన్ని ప్రతి మహిళకూ వివరించాలని పేర్కొన్నారు. తొమ్మిదేళ్లలో ఎవరి మనసైన ప్రత్యక్షంగా, పరోక్షంగా నొప్పించి ఉంటే కుటుంబ సభ్యుడిలా భావించి క్షమించాలని కోరారు.


తాండూర్ : బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**బీఆర్ఎస్‌లో చేరిక..**

భీమిని మండల మల్లిడి గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పద్మశాలీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన వారు కోట మల్లేశ్, రాజు, శ్రావణ్, మల్లేశ్, నగేశ్, సాయి కృష్ణ, బక్కయ్య, ధర్మయ్య, అశోక్, రమేశ్, దుర్గం రవి, సాయి, కిరణ్, రుచిత్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

**తాండూర్‌లో 100 మంది చేరిక**

తాండూర్, నవంబర్ 1 : తాండూర్ మండలానికి చెందిన వంద మంది ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తాండూర్ మండల కేంద్రంలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చిన్నయ్య వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు రైతు బంధు తీసుకునే రైతులను బిచ్చగాళ్లుగా పరిగణిస్తున్నాయని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బంధు పథకాన్ని కాపీ కొట్టి కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా పేరుతో ఎందుకు గ్యారంటీగా ఇచ్చారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో రైతులు కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పి బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు గణపతి అంజి, మండలంలోని యువకులు, తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరికలు**

భీమిని, నవంబర్ 1 : బీజేపీ భీమిని మండల ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కుమ్రం నరేశ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనకు బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, భీమిని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బోనగిరి నిరంజన్ గుప్తా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి పార్టీలో స్వచ్ఛందంగా చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ముత్యం సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ నాయకుల ప్రచారం**

కన్నెపల్లి, నవంబర్ 1 : మండలంలోని లింగాల గ్రామంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బోనగిరి నిరంజన్ గుప్తా, కన్నెపల్లి జడ్పీటీసీ కొటారపు సత్యనారాయణతో పాటు నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో, ప్రభుత్వం చేసిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. మరోసారి దుర్గం చిన్నయ్యను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి మండల అధ్యక్షుడు రంగరావు, యువజన సంఘం అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, సర్పంచ్ తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు నెండుగూరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


భీమిని : బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బోనగిరి నిరంజన్ గుప్తా


కన్నెపల్లి : లింగాలలో ప్రచారం

## ఓటు హక్కు వజ్రాయుధం : డీఆర్డీవో

బెల్లంపల్లి, నవంబర్ 1: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది వజ్రాయుధమని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. 18 ఏళ్లు నిండి ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రలోభాలకు లొంగి ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేకల గోపాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, అకాడమిక్ కో ఆర్డినేటర్ శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్డీవో శేషాద్రి

## ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలి : డీఈవో

మంచిర్యాల అర్బన్, నవంబర్ 1 : దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను, కల్పిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య కోరారు. బుధ వారం జిల్లా కేంద్రంలోని భవిత కేంద్రాల ద్వారా విద్యార్థులకు లభించే ఎస్కార్ట్ అలవెన్స్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, బాలికలకు లభించే స్టైఫండ్‌పై తల్లిదండ్రులకు తెలియజేయాలని ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్(ఐఈఆర్‌పీ)ని ఆదేశించారు. భవిత కేంద్రంలో ఎక్కువ మంది విద్యార్థులకు ఫిజియోథెరపీ సేవలు అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు చౌదరి, నారాయణ మూర్తి, ఐఈఆర్‌పీ సృజన తదితరులు పాల్గొన్నారు.


దివ్యాంగ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

## ఓటు హక్కుపై అవగాహన

తాండూర్, నవంబర్ 1 : మంచిర్యాల జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు డీఆర్డీఏ ఆధ్వర్యంలో తాండూర్, రేచిని, గజ్జలపల్లి గ్రామాల్లో ఓటు హక్కుపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని, వంద శాతం పోలింగ్ అయ్యే విధంగా ప్రజలు వినియోగించుకోవాలని కళాకారులు తమ ఆట పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు లావుడ్యా రమేశ్, బీర్పూరి శ్రీనివాస్, కొప్పర్తి రవీందర్, మార్వాపురం రవికుమార్, అల్లూరి సత్యనారాయణ, నాగలక్ష్మి, సమీరా, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు

## గంజాయి స్వాధీనం

బెల్లంపల్లిరూరల్, అక్టోబర్ 1: బెల్లంపల్లి పట్టణంలోని కన్నాలబస్తీ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం పెట్రోలింగ్ చేస్తుండగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి దగ్గర టేకులబస్తీకి చెందిన గుమాస ప్రశాంత్ గంజాయి సేవిస్తూ కనిపించడంతో పట్టుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. అతని వద్ద నుంచి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఎవరైనా గంజాయి సేవించినా, రవాణా చేసినా వారిపై కేసు నమోదు చేయడమే కాకుండా పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

## గుడుంబా స్థావరాలపై దాడి

నెన్నెల, నవంబర్ 1 : మండలంలోని చిన్న లంబాడీ తండాలో గుడుంబా తయారు చేస్తున్నారన్న సమాచారంతో పోలీసులు గుడుంబా తయారు చేస్తున్న ఇండ్లపై దాడులు చేయగా 35 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 100 లీటర్ల బెల్లంపానకం, సామగ్రిని ధ్వంసం చేసి జాటోత్ సరితపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ పుప్పాల శ్యాంపటేల్ తెలిపారు.

## ఆర్థిక సాయం

భీమిని, నవంబర్ 1 : మండలంలోని అక్కలపల్లి గ్రామంలో ఇటీవల బుర్రి శంకర్ అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని బుధవారం భీమిని ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి పరామర్శించారు. రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లక్ష్మణ్, రమేశ్ పాల్గొన్నారు.

## మద్యం పట్టివేత

బెల్లంపల్లిరూరల్, నవంబర్ 1: బెల్లంపల్లి పట్టణంలోని కాంటా ప్రాంతంలో బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తుండగా నెంబర్2 ఇంక్లైన్‌బస్తీకి చెందిన తైదల లక్ష్మి వద్ద రూ 3260 విలువగల అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. తన ఇంట్లో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపునకు మద్యం తీసుకెళ్తున్నట్లు తెలపడంతో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బెల్ట్‌షాపులకు మద్యం కొనుగోలు చేసి తరలిస్తూ పట్టబడితే కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

## అభివృద్ధి పనులపై సమీక్ష

తాండూర్, నవంబర్ 1 : ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పనిచేసే కూలీల హాజరు 50కి పెంచాలని తెలిపారు. ప్రతి నర్సరీలో కవర్లు నింపేందుకు మట్టిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఆధార్ అనుసంధానం లేని కూలీలకు చెల్లింపుల సమస్య రాకుండా ఆధార్ అనుసంధానం చేయాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్లలో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీ వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లున్నారు.

## ఉపాధి హామీపై సమావేశం

వేమనపల్లి, నవంబర్ 1 : వేమనపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పనులపై ఎంపీడీవో లక్ష్మయ్య సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో కూలీల సంఖ్యను పెంచి ఉపాధి హామీ పనులను చేపట్టాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలు చనిపోకుండా చర్యలు తీసుకోవాలని, ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలన్నారు. నర్సరీల ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని, పల్లె ప్రగతి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల కోసం ఏర్పాట్లు సిద్ధం చేయాలని, పోలింగ్‌కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సత్య ప్రసాద్, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.